క్లుప్తంగా

జూడో పోటీలకు సహకారం అందిస్తాం

కర్నూలు (టౌన్): ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2 వ తేదీ వరకు కర్నూలు నగరంలో నిర్వహిస్తున్న దక్షిణ భారత స్థాయి ఖేలో ఇండియా జూడో పోటీలకు సహకారం అందిస్తానని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ జూడో సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ పోస్టర్లను ఆవిష్కరించారు. క్రీడలకు, క్రీడల నిర్వహణకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జూడో సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ , రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, జూడో సంఘం జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కర్నూలు (టౌన్): లారీ డ్రైవర్లు, స్కూల్‌బస్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని రోడ్డు రవాణ శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక కర్నూలు శివారులోని లాంగ్ లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ కార్యాలయంలో డీటీసీ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ క్యాంపులో డ్రైవర్లకు బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించారు. ఆర్టీవో రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం, ఎంవీఐలు పాల్గొన్నారు.

నగరపాలక పశువైద్యాధికారిగా బి.మల్లన్న

కర్నూలు (టౌన్): నగరపాలక పశువైద్యాధికారిగా డాక్టర్ బి.మల్లన్న నియమితులయ్యారు. ఆదోని పశువైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను డిప్యూటేషన్‌పై నగరపాలకకు కేటాయిస్తు ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం ఆయన నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు కేటాయించిన విధులను మేయర్, కమిషనర్, ఇతర అధికారుల సూచనల మేరకు చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని వెల్లడించారు.

నేడు గానాల రామమూర్తి జయంతి

కర్నూలు(అర్బన్): ఈ నెల 21వ తేదీన విశ్వబ్రాహ్మణుల పితామహుడు బ్రహ్మశ్రీ రావు సాహెబ్ పండిత గానాల రామమూర్తి 131వ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక బీసీ భవన్‌లో నిర్వహించనున్న ఈ జయంతి ఉత్సవాలకు కర్నూలు ఎంపీ డా.ఎస్ సంజీవ్‌కుమార్, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ బీవై రామయ్య తదితరులు హాజరువుతున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి విశ్వకర్మలు, బీసీ ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు కాంగ్రెస్ జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. డీసీసీ కార్యాలయంలో ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుతోపాటు ఏఐసీసీ కార్యదర్శి సీడీ మయప్పన్, కర్నూలు జిల్లా వ్యవహారాల ఇన్‌చార్జ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

'బీజేపీ నాయకులపై దాడులను ఖండిస్తున్నాం'

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలోని బీజేపీ నాయకులపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొలంకి రామస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా కర్నూలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట జిల్లా అధ్యక్షుడు పొలంకి రామస్వామి అధ్యక్షతన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అధికారంలో ఉన్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు గ్రామీణ ప్రాంతాల్లోని తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీ నాయకులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో కాళింగ నరసింహవర్మ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు, తెగింపు, పుష్ ఇన్ బూస్ట్స్ ది లాస్ట్ విష్
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: ధమాకా, వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు, తెగింపు, కల్యాణం కమనీయం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు
ఐనాక్స్: అవతార్ ది వే ఆఫ్ వాటర్, ఎమ్‌త్రీగన్, పుష్ ఇన్ బూస్ట్స్ ది లాస్ట్ విష్
భరత్ కాంప్లెక్స్: తెగింపు
రాజ్: వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య
విజయ: వాల్తేరు వీరయ్య

గర్భిణులకు 'కిల్కారీ' కాల్స్

- మాతాశిశు మరణాల తగ్గింపే లక్ష్యం
- గర్భిణి ఆరోగ్యంతో పాటు సుఖప్రసవానికి తెలుగులో సూచనలు
- శిశువు ఆరోగ్యంగా ఎదిగేందుకు సలహాలు

కర్నూలు(హాస్పిటల్): మాతాశిశు మరణాల తగ్గింపే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా గర్భంతో ఉన్న మహిళ సరైన సమయానికి అవసరమైన జాగ్రత్తలు, మందులు తీసుకునేలా అలర్ట్‌తో కూడిన ఫోన్ కాల్స్ చేస్తున్నారు. కిల్కారీ కాల్స్ పేరుతో ఉన్న ఈ కాల్స్ నిన్నటి వరకు దేశంలో ఐదు భాషల్లో వచ్చేవి. ఇప్పుడు తెలుగులోనూ ఇవి వస్తున్నాయి. మాతృభాషలో కాల్స్ వస్తుండటంతో వాటిని ఆచరించడం వల్ల మహిళ సురక్షిత ప్రసవం అయ్యేందుకు వీలవుతుందని అధికారుల నమ్మకం.

తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. గర్భిణి గర్భం దాల్చింది మొదలు బిడ్డకు జన్మనిచ్చేదాకా ఏఎన్ఎంలు, ఆశాలు ప్రత్యేక యాప్‌ల ద్వారా ఎప్పటికప్పుడు గర్భిణి వివరాలు నమోదు చేస్తూ వస్తున్నారు. దీని ద్వారా గర్భిణి ఆరోగ్య పరిస్థితి ఎప్పటికప్పుడు తెలిసిపోతుంది. ఇప్పుడు నేరుగా గర్భిణితోనే మాట్లాడే విధంగా 'కిల్కారీ' కాల్స్ పేరిట మరో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చారు. కిల్కారి అంటే తెలుగులో చిన్నారి చిరునవ్వు అని అర్థం. ఇటీవల ఈ విధానం జిల్లాలోనూ అమలులోకి వచ్చింది. గర్భం దాల్చిన నాల్గవ నెల నుంచి పిల్లలు పుట్టిన ఏడాది వరకు ఏ వారంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ కాల్స్ ద్వారా ఒక డాక్టర్ చెప్పినట్లు వివరిస్తారు. ఈ మేరకు ప్రతి గర్భిణికి వారి ఫోన్ నంబర్‌కు 0124458000 అనే నంబర్ ద్వారా వారానికి ఒకసారి కాల్స్ వస్తాయి. ప్రతి కాల్ రెండు నిమిషాల వ్యవధి కలిగి ఉంటుంది. మొదటిసారి కాల్ లిఫ్ట్ చేయకపోతే మరో రెండుసార్లు కాల్స్ వస్తాయి. ఆ తర్వాత ఎప్పుడైనా గర్భిణి 14423కి కాల్‌చేసి కాల్స్‌ను వినొచ్చు. గర్భిణి సుఖప్రసవం కావడంతో పాటు బిడ్డకు జన్మనిచ్చాక కూడా ఆ శిశువు ఆరోగ్యంగా ఎదిగేందుకు ఈ కాల్స్ తోడ్పడుతున్నాయి. చేతుల పరిశుభ్రత లేకపోతే జరిగే నష్టాలు, పిల్లలు విరేచనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వయస్సుకు తగిన బరువు ఉండేందుకు ఏమి చేయాలి, పిల్లలకు ఇవ్వాల్సిన ఆహారం వంటి సూచనలు, సలహాలు ఇందులో ఉంటాయి. ఈ విధానాన్ని 2016లోనే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినా ఇటీవలే విస్తృతంగా ప్రాచుర్యం కల్పించారు. మొదట్లో హిందీ, బెంగాలి, బిహారీ, ఒడియా, అస్సామీ భాషల్లో ఈ సేవలను అందించారు. ఇప్పుడు తెలుగులోనూ ఈ సేవలు ప్రారంభించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గణాంకాధికారి హేమసుందరం తెలిపారు.



కిల్కారి కాల్స్‌కు సంబంధించిన చిత్రం

ఫోన్ కాల్ ఇలా ఉంటుంది

'అన్నయ్యా...వదినమ్మా నమస్కారం. బాగున్నారా..!. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కిల్కారీ మొబైల్ సేవ నుంచి డాక్టర్ అనితను మాట్లాడుతున్నా. బిడ్డ ఆరోగ్య సంరక్షణకు మీరు ఆచరించేందుకు సులువుగా ఉండే విషయాలను చెబుతా వినండి. మనమంతా కలిసి మీ బిడ్డకు మెరుగైన భవిష్యత్ అందిద్దాం' అంటూ గర్భిణులకు నాలుగో నెలలో వాయిస్ మెసేజ్ వస్తుంది. బిడ్డ పుట్టిన తర్వాత 'నమస్కారం. మీకు తెలుసా...పుట్టిన గంటలోగా బిడ్డకు పాలు తాగించాలి. తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం. బిడ్డకు కావాల్సినవన్నీ ఈ పాలలో ఉన్నాయి' అని చెబుతారు.

గళం వినిపించేందుకు గెలిపించండి

కర్నూలు సిటీ: ఎన్నో పోరాటాల ఫలితంగా ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును సాధించుకున్నామని ఏపీ ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని జి.పుల్లయ్య, రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీల్లో రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జి.వి.ఎం మోహన్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ ఏడాది మార్చి నెలలో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను ప్రైవేటు విద్యా సంస్థలతో పాటు పలు ఉపాధ్యాయ, అధ్యాపకుల సంఘాల మద్దతుతో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. చట్ట సభల్లో గళం వినిపించేందుకు ఉపాధ్యాయులు, అధ్యాపకులంతా ఏకమై తనను గెలిపించాలన్నారు. సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారులు జి.పుల్లయ్య మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలతో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగిన రామచంద్రారెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా గౌరవ సలహాదారులు ఎస్.శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షులు వాసుదేవయ్య, వివిధ స్కూళ్ల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి రామచంద్రారెడ్డి

సమాజ సేవకులు ఇంజినీర్లు

కర్నూలు (టౌన్): సమాజ సేవకులు ఇంజినీర్లు అని ఆంధ్రప్రదేశ్ లైసెన్స్‌డ్ ఇంజినీర్లు సంఘం అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక బళ్లారిచౌరస్తాలోని ఒక హోటల్‌లో భారతీ సిమెంటు డీలర్ మధు సిమెంటు ఆధ్వర్యంలో కర్నూలు లైసెన్స్‌డ్ ఇంజినీర్ల సంఘం ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా స్థాయి లెవల్ సమావేశం నిర్వహించారు. ఇంజినీర్ల పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ఇంజినీర్లకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రజలకు సేవ చేయడమే పెద్ద సేవ అన్నారు. సొంత ఇంటి కల నేరవేర్చడంలో మన కృషి వెల కట్టలేనిదన్నారు. భారతీ సిమెంటు డీలర్ మధు సిమెంటు ప్రొప్రైటర్ ఎద్దుల మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ సిమెంటు రంగంలో భారతీ సిమెంటు రారాజుగా వెలుగొందుతుందన్నారు. నాణ్యత ప్రమాణాలు వంద శాతం పాటిస్తున్నందునే వినియోగదారుల నుంచి మంచి స్పందన ఉందన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్ల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు విజయానంద్, ప్రసాద్, షేక్ హిదయాతుల్లా ఖాన్, శంకర్, మహమ్మద్ ఏజాస్, జాకీర్ హుస్సేన్, సుధీర్ కుమార్, కేశవయ్య పాల్గొన్నారు. అనంతరం లైసెన్స్‌డ్ ఇంజినీర్ల సమస్యలపై చర్చించారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చెరుకూరి శ్రీనివాసరావు

25 నుంచి క్రీడాకారుల ఎంపిక

కర్నూలు (టౌన్): వచ్చే నెలలో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఈనెల 26 నుంచి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 26న అథ్లెటిక్స్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, 27న బాల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, హాకీ, బ్యాడ్మింటన్, 28న ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, ఖో-ఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్ వంటి క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ నటరాజారావు 9440256787 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

షూటింగ్ బాల్ పోటీల్లో విజేతలుగా నిలవాలి

కర్నూలు (టౌన్): ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న అండర్-21 బాలబాలికల రాష్ట్రస్థాయి శాప్ లీగ్ షూటింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజేతలుగా నిలవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హాకీ పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): ఈ నెల 28 నుంచి 30 వరకు అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో నిర్వహిస్తున్న 13వ హాకీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ మహిళల అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా జట్టు సత్తా చాటి విజేతలుగా రావాలని ఎస్‌టీబీసీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సునీత రోజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో రాష్ట్ర పోటీల్లో పాల్గొంటున్న జిల్లా మహిళా హాకీ జట్టు క్రీడాకారులను వైస్ ప్రిన్సిపాల్ పరిచయం చేసుకున్నారు. ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు హాకీ క్రీడల్లో రాణించడం హర్షణీయమన్నారు. క్రీడల్లో రాణించే వారికి ప్రభుత్వం స్పోర్ట్సు కోటా కింద ఉద్యోగావకాశాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో హాకీ కర్నూలు కార్యదర్శి దాసరి సుధీర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ టారీఫ్‌పై కొనసాగిన సలహాల స్వీకరణ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ టారిఫ్‌పై ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సీ) చేపట్టిన విచారణ శుక్రవారం కూడా కొనసాగింది. విశాఖపట్నం నుంచి చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్‌పై సమగ్ర ఆదాయ, కాస్ట్, సబ్సిడీ సర్ఛార్జీలు, ఆవశ్యకత, టారిఫ్ ప్రతిపాదనలపై సలహాలు, సూచనలు, అభ్యంతరాలు, విన్నపాలు స్వీకరించారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు, కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి పాల్గొన్నారు. శనివారం కూడా సలహాలు, అభ్యంతరాలు, సూచనలు సేకరణ ఉంటుందని, ఏపీ ఈఆర్‌సీ వెబ్‌సైట్ / మెయిల్‌లో ముందుగా రిజిష్టర్ చేసుకున్న వారు ఆన్‌లైన్ ద్వారా పాల్గొనేందుకు కర్నూలు విద్యుత్ భవన్, నంద్యాల, ఆదోని, డోన్ డివిజన్ కేంద్రాల్లో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

మహిళా దొంగపై కేసు నమోదు

కర్నూలు(టౌన్): కర్నూలు రెండవ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపేటలో తెలిసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న అదే కాలనీకి చెందిన స్వప్న అనే మహిళా దొంగపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికంగా కొత్తపేటలో టైలరింగ్ శిక్షణ ఇస్తున్న రాణి ప్రియాంక అనే మహిళ ఇంటిలో టైలరింగ్ శిక్షణ నేర్చుకుంటుంది. ఈ నెల 17వ తేదీన అదే ఇంట్లో ఐదు చీరలు, ఒక జత బంగారు కమ్మలు, అర తులం మాటీలు దొంగతనం చేసింది. అలాగే నిందితురాలైన స్వప్న ఇంటిపైన ఉన్న సంధ్యారాణి ఇంట్లో బంగారు చైన్, రూ.10 వేల నగదు చోరీ చేసింది. బాధితురాళ్ల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం

సమాచారం మేరకు బుధవారపేటలో మూడవ పట్టణ పోలీసులు ఓ ఇంట్లో సోదాలు చేశారు. ఆ ఇంట్లో పావుకిలో గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరికి విక్రయిస్తున్నారు అనే కోణంలో మరింత విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

అక్రమ కట్టడాలపై హైకోర్టుకు వెళ్తాం

- ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రసూల్

కర్నూలు(సెంట్రల్): కర్నూలులోని బళ్లారి చౌరస్తా సమీపంలో ఉన్న అలీసాబ్ మసీదు స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలిపివేసేందుకు హైకోర్టులో పిటిషన్ వేయనున్నట్లు ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రసూల్ తెలిపారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వే నంబర్ 311లో ఉన్న మసీదు స్థలంలో కొందరు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్మాణాన్ని ఆపాలని మునిసిపల్ కమిషనర్, వక్ఫ్‌బోర్డు సీఈఓలకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో హైకోర్టుకు వెళ్తున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలో దాదాపు 25 వేల ఎకరాల భూములు వక్ఫ్‌బోర్డు పరిధిలో ఉన్నాయని, అయితే వాటిలో చాలా వరకు చట్టంలోని లోసుగులను ఆసరాగా చేసుకొని అక్రమార్కులు ఆక్రమించుకున్నారన్నారు. వీటిన్నింటిని పరిరక్షించుకునేందుకు త్వరలోనే వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈకమిటీలో ముస్లింలు, క్రిష్టియన్‌లు, బౌద్ధులు, జైనులు సభ్యులుగా ఉండేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో అన్వర్‌బాష, షేక్ ఫక్రుద్దీన్, ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల సమ్మెను విజయవంతం చేద్దాం

కర్నూలు(అగ్రికల్చర్): ఈనెల 30, 31 తేదీల్లో చేపట్టే బ్యాంకుల సమ్మెను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ జిల్లా కన్వీనర్ నాగరాజు కోరారు. శుక్రవారం సాయంత్రం రెండు రోజుల సమ్మెను విజయవంతం చేయడంపై గాయత్రి ఎస్టేట్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. బ్యాంకు యూనియన్ల డిమాండ్లను కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందని, ఇందువల్లనే సమ్మెకు వెళ్లక తప్పడం లేదన్నారు. బ్యాంకింగ్ రంగంలో వెంటనే ఐదు రోజుల పనిదినాలను అమలు చేయాలని, వేతన సవరణకు అనుగుణంగా పెన్షన్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. అన్ని కేడర్లలో అవసరాన్ని బట్టి నియామకాలను చేపట్టాలని కోరారు. బ్యాంకుల సమ్మెలో కో ఆపరేటివ్, గ్రామీణ బ్యాంకుల మినహా అన్ని బ్యాంక్ యూనియన్లు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, ఏఐబీఈఏ నాయకురాలు రోజారమణి, స్టేట్‌బ్యాంక్ యూనియన్ నాయకులు శ్రీకాంత్, జియా, గ్రామీణ బ్యాంకు నాయకులు హనుమంతురెడ్డి, ఏఐటీయూసీ నాయకుడు చంద్రశేఖర్, యూనియన్ బ్యాంకు నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.



గాయత్రి ఎస్టేట్‌లోని యూబీఐ బ్రాంచ్ ఎదుట ప్రదర్శన నిర్వహిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలో శనివారం చేపట్టే నిర్వహణ పనుల కోసం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ టౌన్ ఈఈ రమేష్, కర్నూలు-1, రూరల్స్, గూడూరు ఏడీఈలు రాజమోహన్‌రెడ్డి, సుబ్బన్న, జేసన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సబ్ డివిజన్ల పరిధిలోని 33/11కేవీ సబ్‌స్టేషన్లు పవర్‌హౌస్, సెంట్రల్ సెక్షన్, బళ్లారీ రోడ్డు, సంతోష్ నగర్, ఓల్డ్‌టౌన్, జోహరాపురం, ఉస్మానియా, వార్త, శరీన్‌నగర్, జి.పుల్లారెడ్డి, ఆర్‌సీఎస్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌ల పరిధిలోని ఖడక్‌పురా మైదానం, మాసుంబాషా దర్గా, గాయత్రి ఎస్టేట్, బిర్లాగడ్డ, ఠాగూర్ నగర్, లక్ష్మీనగర్, మద్దూర్ నగర్, బీ.క్యాంప్, సీ.క్యాంప్, గణేష్ నగర్, రెవెన్యూ కాలనీ, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, నంద్యాల చెక్‌పోస్టు ఏరియా, శేషాద్రీ నగర్, పోస్టల్ కాలనీ, మారుతి మెగా సిటీ, బృందావన్ నగర్, మారుతి నగర్, అరుంధతి నగర్, టెలికాం నగర్, గఫూర్ నగర్, పార్థసారథీ నగర్, కమలానగర్, రామచంద్రనగర్, రామకృష్ణ నగర్, గుత్తి రోడ్డు, అబ్బాస్ నగర్, వడ్డెగేరి, బుధవార పేట, కృష్ణానగర్, పాతబస్తీ, ఇందిరమ్మ కాలనీ, మిలటరీ కాలనీ, కల్లూరులోని కాలనీలు, గూడూరు, కోడుమూరు, సీ.బెళగల్, కర్నూలు, ఓర్వకల్లు మండలాల్లోని గ్రామాలు, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి నెలా 2వ శనివారం నిర్వహించాల్సిన నిర్వహణ, అభివృద్ధి పనులను సంక్రాంతి పండుగ కారణంగా వాయిదా వేసి మూడో శనివారం నిర్వహిస్తున్నామని, ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రహణమొర్రి, గ్రహణ శూల శిబిరం

కర్నూలు(సిటీ): బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శుక్రవారం సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో గ్రహణ మొర్రి, గ్రహణ శూల వ్యాధి ప్రాథమిక నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బసవతారకం ట్రస్ట్ వైద్యులు డాక్టర్ డి.ముకుందరెడ్డి, డాక్టర్ టి. జోషిల ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన 35 మంది గ్రహణ మొర్రి, గ్రహణ శూల వ్యాధి పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. పది మంది పిల్లలకు ఆపరేషన్ ద్వారా వారి లోపాన్ని సరిచేయవచ్చని నిర్ధారించారు. ఆపరేషన్ అనంతరం బాధిత విద్యార్థులు సాధారణ విద్యార్థుల్లాగే చదువుకునే అవకాశముంటుందని సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్‌కు తెలియజేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధించే టీచర్లకు వారికి ఏ విధంగా బోధించాలి అనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

చేతివృత్తిదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతివృత్తిదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని చేతివృత్తిదారుల సంఘాల సమన్వయ కన్వీనర్ సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో చేతివృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులు-అభివృద్ధి, సంక్షేమం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చేతి వృత్తిదారులకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను వారి అభివృద్ధికే ఖర్చు చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 1.70 కోట్ల మంది చేతివృత్తులపై ఆధారపడిజీవనం సాగిస్తున్నారని, వారి వృత్తుల అభివృద్ధికి బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలన్నారు. చేతివృత్తి దారుల సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర సదస్సును ఈ నెల 30న కర్నూలులో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి పి.గోవిందు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు శేషఫణి, నాయీబ్రాహ్మణ సంఘం కర్నూలు నగర కార్యదర్శి ఈశ్వరయ్య, మహిళా సంఘం జిల్లా నాయకులు సుజాత, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాముడు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ హాజరై మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న గురుశేఖర్

ఆరోగ్యాన్ని మించిన సంపద లేదు

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్యాన్ని మించిన సంపద లేదని, దానిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ రోజూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలోని స్కంధాన్షిలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ పేదలు నివసించే కాలనీల్లోనూ ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ విజయమాధురి, స్కంధాన్షి గార్డెనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సి. విజయ్‌కుమార్, వెంకటరెడ్డి, జనరల్ సెక్రటరీ నజీర్ పాల్గొన్నారు.

హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న సహస్ర హాస్పిటల్‌లో వైద్యసేవలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి డిమాండ్ చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సదరు ఆసుపత్రిలో ఇష్టమొచ్చినట్లు రోగుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని, వైద్యులు సకాలంలో లేకపోయినా రోగులను చేర్చుకుంటున్నారని ఆరోపించారు. దీనివల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు బాబయ్య, బీసన్న పాల్గొన్నారు.

ఆడిటోరియం నిర్మించండి

కర్నూలు (టౌన్): నగరంలో పాతబస్టాండ్‌లో మున్సిపల్ ఆడిటోరియం నిర్మించాలని జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.అంకయ్య విన్నవించారు. శుక్రవారం స్థానిక నగర పాలకలో మేయర్ బివై.రామయ్య, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు హనుమంతరావు చౌదరి, రాజేశ్వరరెడ్డి, అజయ్‌కుమార్, రోషన్ అలీ, చాంద్‌బాషలు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

కర్నూలు సిటీ: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో ప్రతిభ చూపిన బిక్యాంపులోని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీ విద్యార్థి ఎం.మారుతి నాయక్‌ను జిల్లా వృత్తి విద్యాధికారి జమీర్ బాషా, ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టిలు శుక్రవారం అభినందించారు. ఈ నెల 7, 8 తేదీల్లో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో నిర్వహించిన అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీలలో విద్యార్థి పాల్గొన్న జట్టు రన్నర్‌గా నిలిచింది. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకై ఉద్యమిస్తాం

కర్నూలు (న్యూటౌన్): ఎస్సీ వర్గీకరణే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్తామని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైకే విశ్వనాథ్ మాదిగ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లాల నేతల సమావేశం స్థానిక ఎంపీపీ హాల్‌లో నిర్వహించారు. ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త గూడాల ఈశ్వరయ్య మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ , వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు, తెల్లరేషన్ కార్డుదారులకు 4 కేజీల నుంచి 5 కేజీల బియ్యం, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు సాధించిన ఘనత మంద కృష్ణ మాదిగకే దక్కిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎంఎస్పీ కీలక పాత్ర పోషించనున్నట్లు చెప్పారు. 2024లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రకుల పేదలందరి సహకారంతో రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తామన్నారు. సమావేశంలో ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ సుభాష్‌చంద్ర, కో కన్వీనర్ వెంకటేశ్వర్లు, నంద్యాల జిల్లా కన్వీనర్ కోళ్ల కల్యాణ్, కో కన్వీనర్ వెంకట సుబ్బన్న, కోటా ప్రభాకర్, ఎంఎస్ఎఫ్ జాతీయ నాయకులు బుచ్చర్ల నరసింహులు, చిలకము రాబిన్‌సన్ రాజు, రాష్ట్ర అధ్యక్షుడు బెనర్జీ మాదిగ, లాయర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవికాంత్, చంద్రుడు, వీరన్న, ఎంఎస్పీ బుడగ సంఘం జాతీయ నాయకులు తాటికొండ నారాయణ, ఎంఈఎఫ్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు శ్రీరాములు, ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ ఆశపోగు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు వైకె విశ్వనాథ్ మాదిగ

గణతంత్ర వేడుకలకు సిల్వర్‌జూబ్లీ విద్యార్థులు

కర్నూలు సిటీ: ఈ నెల 26వ తేదీన అమరావతిలో జరుగనున్న రాష్ట్రస్థాయి గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ఎన్‌సీసీ విద్యార్థులు ఎంపికైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జి.శశికుమారి , పావని, ఎ.రాణి(బీఎస్సీ సెకండియర్)లు వేడుకల్లో పాల్గొంటారన్నారు.